క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

ఎంఈవో బాలసుందరరావు

బెల్లంకొండ: ఓపెన్ స్కూల్ విద్యా విధానం ద్వారా చదువుకునేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంకొండ ఎంఈవో–2 బాలసుందరరావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యాసకులు నేరుగా ఆన్‌లైన్‌లో గానీ, గ్రామ సచివాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు బెల్లంకొండ జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

జాతీయ అవార్డు గ్రహీత మురళికి సత్కారం



సత్తెనపల్లి: జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డుకు ఎంపికైన సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళిని చత్రపతి కళా పరిషత్ సభ్యులు పూల మాలలు, దుశ్శాలువతో సోమవారం ఘనంగా సన్మానించారు. అమరావతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్నకర్నాటి మురళి ఆగస్టు 7న ఢిల్లీలో భారత్ భవనంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అరుదైన జాతీయ అవార్డు అందుకోనున్నారు. జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం సత్తెనపల్లి పట్టణానికే గర్వకారణమని మురళి ప్రతిభను చత్రపతి కళా పరిషత్ సభ్యులు పులహరి గోవిందు, వెంకోజీ, భవాని ప్రసాదు, యర్రా ఆదినారాయణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పులిహరి బానోజీ, వెంకటేశ్వర్లు, ఫిరోజ్, శివాజీలు కొనియాడారు.

పెండింగ్‌లో ఉన్న పెన్షనర్స్ బకాయిలు తక్షణం చెల్లించాలి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌కు పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్సీ అరియర్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సోమవారం ఆయన కోరారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన ఫైనాన్స్ వాలిడేషన్ ఎమెండ్‌మెంట్ రద్దు చేయాలన్నారు. 12వ పే కమిషన్ వెంటనే నియమించాలన్నారు. కమ్యూటేషన్ 15 సంవత్సరాలకు బదులుగా 11 సంవత్సరాలకు కుదించాలన్నారు. రైలు, విమాన ప్రయాణాలలో సీనియర్ సిటిజన్స్‌కు కన్‌సెషన్ పునరుద్ధరించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికై జరుగు ధర్నాకు జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ కార్యదర్శి కేబీ ఆర్‌జే ప్రసాద్ ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు సత్తెనపల్లి, రాజుపాలెం మండలాలు ఎంపిక



రాజుపాలెం: ఆయిల్ పామ్ సాగుకు జిల్లాలో 8 మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని గణపవరంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ అవగాహన సమావేశం వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగుకు సత్తెనపల్లి, రాజుపాలెం మండలాలను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు నీరు సమృద్ధిగా ఉండాలని తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు పంట కుంటలు నిర్మించుకొనుటకు రూ.75 వేలు రాయితీ అందజేయడం జరుగుతుందని, రైతులు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.రామ్మోహన్‌రావు, ఉద్యాన శాఖ అధికారి ఎస్‌కే నబీరసూల్, నరసరావుపేట వ్యవసాయాధికారి పి.నర్సయ్య, మండల ఉద్యాన శాఖాధికారి ఎం.నవీన్ తదితరులు ఉన్నారు.

వినుకొండలో భారీ అగ్ని ప్రమాదం

వినుకొండ : పట్టణంలోని హనుమాన్‌నగర్ జీరో లైన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. మంటలు భారీగా వ్యాపించడంతో చుట్టుపక్కల వారు భయాందోళనలతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి సుమారు 2గంటల సమయం పట్టింది. అసలు ప్రమాదం ఎందుకు జరిగింది?, ఎలా జరిగింది అనేది బాధితుల నుండి సమాచారం రావాల్సి ఉంది.

వృక్షాలకు రక్షణేది..?!

- రోడ్ల పక్కన వృక్షాలకు నిప్పు పెడుతున్న దుండగులు
- నిలువునా కూలుతున్న నీడనిచ్చే చెట్లు
- రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలడంతో ట్రాఫిక్‌కు ఆటంకం
- చెట్లకు నిప్పుతో వస్తున్న దట్టమైన పొగతో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఏళ్లనాటి వృక్షాలు నిలువునా కూలుతున్నా పట్టించుకోని ప్రభుత్వం



నిప్పు పెట్టడంతో కూలిపోయిన కారంపూడి రోడ్డులోని మహా వృక్షం

నకరికల్లు: వందల ఏళ్లుగా ప్రజలకు నీడనిస్తున్న మహా మహా వృక్షాలకు నిప్పు పెట్టడంతో నిలువునా కూలిపోతున్నాయి. చెట్లకు పెట్టిన నిప్పుతో దట్టమైన పొగలు వ్యాపించి ఎదురుగా వెళ్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఓవైపు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడతామని చెబుతున్న కూటమి నేతలు, అధికారులు ఉన్న చెట్లను నిలువునా కాల్చేస్తున్నా చూస్తూ మిన్నకుండిపోతున్నారు. దీంతో ఎందరికో సేదతీరుస్తున్న మహా మహా చెట్లు నిట్టూరుస్తూ నేలకొరుగుతున్నాయి.

చెట్లకు నిప్పు పెడుతున్న దుండగులు

మండల కేంద్రమైన నకరికల్లు నుంచి కారంపూడి వెళ్లే రోడ్డు, నరసరావుపేట వెళ్లే రోడ్డులో వందల ఏళ్ల క్రితం నాటి చింతచెట్లు, అక్కడక్కడా వేప చెట్లు ఉన్నాయి. ఇటీవల కొందరు గుర్తు తెలియని దుండగులు చెట్లకు నిప్పు పెట్టి వెళ్తున్నారు. మొదలు పూర్తిగా కాలిపోవడంతో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా కూలిపోతున్నాయి. గత రెండురోజుల క్రితం కారంపూడి రోడ్డులో భారీ చింతచెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ నిలవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు. తాజాగా ఆదివారం నరసరావుపేట రోడ్డులో రోడ్డు పక్కన చెట్టుకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. తీవ్రమైన గాలి తోడవడంతో రోడ్డంతా పొగమయమై దారి కూడా కన్పించని పరిస్థితి ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు కళ్లలో పొగచూరడంతో ఇబ్బంది పడగా, బస్సులు, కార్లు దారి కనిపించక లైట్లు వేసుకొని హారన్‌లు కొట్టుకుంటూ పొగ నుంచి బయట పడాల్సి వచ్చింది. పొగ కారణంగా ఏ మాత్రం ఎదుటి వాహనాలు కన్పించకపోయినా పెను ప్రమాదం జరిగే ముప్పు ఉంది.

తరచూ సంభవిస్తున్న ఘటనలు

నరసరావుపేట రోడ్డులోను, కారంపూడి రోడ్డులోను తరచూ చెట్లకు నిప్పు పెట్టే ఘటనలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇంటింటికి చెట్లు నాటుతామని ప్రచారం చేసుకుంటూ వందల ఏళ్లుగా ఉన్న చెట్లను కాపాడడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు ఉన్న చెట్లను కూడా కాల్చేయడంతో పర్యావరణంలో సమతుల్యత లోపించడంతో పాటు వాహనదారులు కొద్ది సేపు సేదతీరాలన్నా చెట్లు కరువయ్యే పరిస్థితి దాపురిస్తుంది.



నరసరావుపేట రోడ్డులో చెట్టుకు నిప్పు పెట్టడంతో వస్తున్న దట్టమైన పొగలో వెళ్తున్న ఆర్టీసీబస్సు, కారు



పొగతో రోడ్డు కన్పించక లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు

నా దృష్టికి రాలేదు

చెట్లకు నిప్పు పెట్టిన విషయం నా దృష్టికి రాలేదు. రోడ్ల వెంబడి చెట్లు నరకకుండా, కాల్చకుండా నిఘా పెడతాం. చెట్లను కాల్చిన వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– జి.రవీంద్ర, ఏఈ, ఆర్ అండ్ బీ, నకరికల్లు సర్కిల్

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

వ్యవసాయ సహాయ సంచాలకులు కన్నయ్య

అచ్చంపేట: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు, అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ కార్యాలయ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కన్నయ్య, విజిలెన్స్ సీఐ అపర్ణ స్థానిక ఎరువులు, పురుగు మందు షాపు యజమానులను హెచ్చరించారు. సోమవారం వారు అచ్చంపేట, పెదపాలెం గ్రామాలలోని ఎరువులు, పురుగు మందు షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలించారు. స్టాక్ వివరాలను ఏరోజుకు ఆరోజు స్టాక్ బోర్డులో ఉంచాలని, ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే లైసెన్సు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతుకు కొనుగోలు బిల్లు ఇవ్వాలని, పంట కాలం పూర్తయ్యేంత వరకు జవాబుదారీగా ఉండాలన్నారు. పురుగు మందుల శాంపిల్స్‌ను నాణ్యత పరీక్షలకు పంపాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో అచ్చంపేట, పెదపాలెం ఎరువులు, పురుగుమందు విక్రయ డీలర్లు పాల్గొన్నారు.

56 ఎరువుల బస్తాలు సీజ్

రాజుపాలెం: మండల కేంద్రం రాజుపాలెంలోని బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిలువ ఉంచిన 56 ఎరువుల బస్తాలను విజిలెన్స్ సీఐ ఎస్‌ఎస్‌ఎస్ అపర్ణ సీజ్ చేశారు. మండల కేంద్రంలోని బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ షాపులో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ అపర్ణ, ఏడీఏ కె.కన్నయ్య పాల్గొన్నారు. తనిఖీలలో స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించగా ఫారం లేకుండా అమ్మకాలు జరపడం, ఈ పోస్ మిషన్లో నమోదు చేయకపోవడం వలన రూ.66,770 విలువ చేసే 56 ఎరువు బస్తాలను సీజ్ చేసి షాపు నిర్వాహకుడు కొరివి వెంకటేశ్వరరావుపై 6ఏ కేసు నమోదు చేశారు. అదే విధంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు లేనటువంటి రూ.58,962 విలువ గల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య, అచ్చంపేట మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు



రాజుపాలెం బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

నేడు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

సత్తెనపల్లి: ప్రతిభావంతులైన 20 మంది పేద విద్యార్థులకు డాక్టర్ చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో శభరిగిరి అపార్ట్‌మెంట్ వద్ద ఉపకార వేతనాలు పంపిణీ జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది చిట్టా భరద్వాజ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రతిభ గల 20 మంది నిరుపేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష నగదు ఆర్థిక సహాయంగా అందజేయటం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వివరాలకు 9440226993 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు



వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్–2లోని స్థలం ఆక్రమణకు గురైన బాధితులు



దూదేకుల సైదాబి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన పత్రం

తహసీల్దార్ కె.పుల్లారావు

నకరికల్లు: పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలలో నకిలీవి సృష్టించి ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కె.పుల్లారావు హెచ్చరించారు. నకరికల్లులోని ఎన్నెస్పీ కాలనీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వైఎస్సార్ జగనన్న కాలనీ–2లో దూదేకుల సైదాబికి ప్లాటు నంబరు 111ను అప్పటి తహసీల్దార్ టి.ప్రశాంతి మంజూరు చేశారు. కాగా ప్రభుత్వం మారాక అధికార పార్టీ పేరు చెబుతూ నకరికల్లుకు చెందిన వ్యక్తి సదరు స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. ఈ నేపథ్యంలో అసలైన లబ్ధిదారులు ఈ స్థలం ప్రభుత్వం మాకు కేటాయించిందని చెప్పినా నా దగ్గర పట్టా ఉందంటూ అడ్డం తిరిగి ఆక్రమణకు దిగడంతో బాధితురాలు న్యాయం కోసం తహసీల్దార్‌ను ఆశ్రయించింది. ఈ మేరకు పట్టాలను పరిశీలించిన నకరికల్లు తహసీల్దార్ కె.పుల్లారావు పట్టాలను తన వద్దే ఉంచి విచారణ చేస్తానని సర్ది చెప్పారు. కాగా అదే వ్యక్తి మరొక స్థలాన్ని కూడా ఆక్రమించుకునేందుకు ప్రయత్నించినట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం.

చర్యలు తప్పవు



నకరికల్లులోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్–2లో కొన్ని బోగస్ పట్టాలు సృష్టించినట్లు మా దృష్టికి వచ్చింది. 2021లో తహసీల్దార్‌గా పనిచేసిన టి.ప్రశాంతి సంతకాన్ని ఫోర్జరీ చేసి పట్టాలు సృష్టించినట్లు తెలిసింది. డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌తో కమిటీ వేసి విచారణ చేపడతాం. తహసీల్దార్ సంతకం ఫోర్జరీతో దొంగ పట్టాలు సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. దొంగ పట్టాలు తీసుకున్న వారు స్వచ్ఛందంగా రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలి. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. అలాగే లే అవుట్–2లో నివేశన స్థలం పట్టాలు పొందిన వారు కార్యాలయానికి వచ్చి తమ పట్టాలు సరియైనవా కావా అన్నది తనిఖీ చేయించుకోవాలి. – కె.పుల్లారావు, తహసీల్దార్, నకరికల్లు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు



మాట్లాడుతున్న పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

క్రోసూరు: అధికార కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్నా ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశారని.. ప్రజల తరపున నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులను చూసి ఓర్వలేక నియోజకవర్గంలో తిరగనివ్వం అంటూ టీడీపీ నాయకులు ఆదివారం మీడియా సమావేశంలో అప్రజాస్వామికంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం క్రోసూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభపై టీడీపీ నాయకులు చేసిన విమర్శలను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పికొట్టారు. కార్యక్రమానికి క్రోసూరు మండల అధ్యక్షుడు వెలది అప్పారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పద్మావెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకుడు కంచేటిసాయిబాబు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ మారతారని, యూరోప్ నుంచి 15 రోజులకొకసారి వస్తున్నాడని వ్యక్తిగత విమర్శలు చేయటం మంచి పద్ధతి కాదని అన్నారు. ప్రజల్ని మభ్యపెట్టే మాటలు మాట్లావద్దని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకరరావును నియోజకవర్గానికి తీసుకొచ్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. పార్టీలు మార్చే మీరు శంకరరావుపై విమర్శలు చేయటం ఏమిటన్నారు.

- పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంగిసెట్టి కోటేశ్వరరావులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి పొందిన జూనియర్ వెంకట్రావు, షాడో నాయకుడిగా చెప్పుకున్న కంచేటి సాయిబాబు ఈ రోజు టీడీపీలో చేరి వ్యక్తిగత విమర్శలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో మాజీ ఎమ్మెల్యే శంకరరావు చేసినన్ని అభివృద్ధి పనులు ఎవరూ చేయలేదన్నారు. అమరావతి– బెల్లంకొండ రోడ్డు, గ్రామాల్లో సీసీ రోడ్లు, కల్వర్టులు 50 శాతం పూర్తి చేయటం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రోడ్డు ఎందుకు వేయలేకపోతున్నారని నిలదీసారు. చిలకా చంద్రయ్య మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో తిరగనివ్వం అంటూ బెదిరింపులు చేస్తే భయపడిపోమని, పెదకూరపాడు నియోజకవర్గం మీ జాగీరు కాదని అన్నారు.
- బెల్లంకొండ మండల పార్టీ అధ్యక్షుడు ఎక్కిరాల నర్సిరెడ్డి మాట్లాడుతూ మేము సరదాగా రాజకీయాలు చేయటానికి రాలేదని, ఏ ఊరికి రమ్మంటారో చెప్పండి అభివృద్ధిపై మాట్లాడదాం అన్నారు.
- మాజీ సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల కోసం ఎన్నో గొప్ప పనులు చేసారని, సీఎంగా ఉండి చంద్రబాబు టీడీపీ వారికే పని చేయాలని చెప్పిన ముఖ్యమంత్రి అని అన్నారు. అధికారం శాశ్వతం కాదని తెలుసుకోవాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, అచ్చంపేట మండల పార్టీ అధ్యక్షుడు చిలకా చంద్రయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి కోటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ చిలకా పెదబాబు, క్రోసూరు మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, మాజీ సర్పంచ్ నర్రా వాసు, క్రోసూరు జెడ్పీటీసీ షేక్ గఫూర్, లేళ్ల చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, గాదె వెంకటరెడ్డి, షేక్ అబ్దుల్‌ఖాదర్, గార్లపాటి దాసు పాల్గొన్నారు.

• మళ్లీ విత్తాల్సిందేనా..?!



వానలు లేక బెట్టకొచ్చిన పత్తి చేను

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో ఇప్పటికే సుమారు 70 శాతం పత్తి పైరును విత్తటం జరిగింది. ప్రస్తుతం మొలిచిన మొక్కలు మొదటి దశలోనే వానలులేక బెట్టకు రావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో నాలుగైదు రోజుల పాటు అడపాదడపా వానలు కురవటంతో పత్తి చేలలో పదును అంతంత మాత్రంగా ఉన్న వర్షాలు కురవకపోతాయా అనే నమ్మకంతో మండలంలో సుమారు 7 వేల ఎకరాలలో పత్తి విత్తనాలను నాటారు. ముందుగా వేసిన విత్తనాలు మొలవటంతో ప్రస్తుతం గత వారంరోజుల నుంచి వానలు వెనుకాడటంతో రైతులు మరలా వానల కోసం ఎదురు చూస్తున్నారు. అల్పపీడన ద్రోణి ఏర్పడటంతో వానలు కురుస్తాయని ఏరోజుకారోజు పత్తి రైతులు ఎదురుచూస్తున్నప్పటికీ నిరాశే ఎదురవుతుంది. దీనికి తోడు గాలులు వేగంగా వీస్తూ ఎండలు కాయటంతో పత్తి మొక్కలు వడబడుతున్నాయి. అసలే గత సంవత్సరం గులాబీ రంగు పురుగు వల్ల నష్టపోయిన రైతులు అప్పులు చేసి విత్తనాలు నాటితే మరో నాలుగురోజుల పాటు వర్షాలు కురవకపోతే మరలా పత్తి విత్తనాలు నాటాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటీఎం మోడల్ సాగుతో నిరంతర ఆదాయం




విత్తనాలను సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ రైతులు, సిబ్బంది

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్ పద్ధతిలో సాగు చేస్తే రైతులు 365 రోజులు నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం క్రోసూరు డివిజన్ ఎంటీ జయలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు టి.శ్రీనివాసరెడ్డి 30 సెంట్ల భూమిలో ఏటీఎం మోడల్ విధానాన్ని వేశారు. ఈ సందర్భంగా ఎంటీ మాట్లాడుతూ ఈ మోడల్ విధానంలో ముందుగా భూమిని చదును చేసి నాలుగు అడుగుల వెడల్పు బెడ్లుగా, ఒక అడుగు నీటి కాలువలుగా ఏర్పాటు చేసి ఆ బెడ్లపై 18 రకాల దుంప, తీగ జాతి, ఆకుకూరలు, కూరగాయలు, బోర్డర్ క్రాప్‌గా మొక్కజొన్న వేయాలని తెలిపారు. ఏటీఎం మోడల్‌లో ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆహార ఉత్పత్తులను తినడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. భూమి 365 రోజులు పచ్చగా ఉంటుందని, పండించిన కూరగాయలు, ఆకుకూరల ద్వారా రైతుకు నిరంతరం ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు కె.జ్యోతి, బి.శ్రీనివాసరెడ్డి, టి.మాధవి, సావిత్రి, ఐసీఆర్పీలు అంకమ్మరావు, యలమందమ్మ, తిరుపతమ్మ, నరసింహారావు, జ్యోతి, సమరసింహారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు ఆర్థిక చేయూత

శావల్యాపురం: 2001–02 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం సందర్భంగా తమ స్నేహితులను ఆర్థిక చేయూత అందజేసినట్లు పూర్వ విద్యార్థుల ప్రతినిధి ముంద్రు సింగారావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారం అందరు స్వచ్ఛందంగా ఐక్యంగా ఇచ్చిన ఆర్థిక సహాయంలో భాగంగా శావల్యాపురం గ్రామానికి చెందిన జి.వి జయలక్ష్మి రూ.50వేలు, కనమర్లపూడి గ్రామానికి చెందిన మాణిక్యారావు రూ.50 వేలు తమ వంతు సహయంగా ఆర్థిక సహాయం అందజేశామన్నారు. అలాగే తాము చదువుకున్న పాఠశాలకు రూ. 10 వేలు అందజేశామన్నారు. ఇలాంటి సహకారం అందించటం పలువురుకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, భార్గవ్, చింతా వెంకట్రావు, మందపాటి వెంకట్రావు,పుట్టా బ్రహ్మానందం, ముట్లూరి సుధాకర్, సంపూర్ణరెడ్డి, చెరుకూరి అనురాధ,వంకాయలపాటి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మట్టి తరలిస్తూ సాగర్ కెనాల్లో ట్రాక్టర్ పల్టీ



యడ్లపాడు: ఇరిగేషన్ చెరువులో అక్రమ మైనింగ్.. ఆ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వాహనాల అతివేగం వెరసి పెనుప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని లింగారావుపాలెంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మైదవోలు గ్రామంలోని చెరువు మట్టిని సొలస గ్రామం పరిధిలోని తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి లింగారావుపాలెం గ్రామం ప్రారంభంలో ఉన్న అక్విడెక్ట్ వద్ద సాగర్ కాలువలో పడింది. వేగంగా వస్తున్న ట్రాక్టర్ వంతెన వద్ద మలుపు తిరిగే సమయంలో స్టీరింగ్ కట్ కాకపోవడం, అదుపుకాక కాల్వలో ట్రక్కు నుంచి విడిపోయిన ట్రాక్టర్ ఇంజన్ బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని గ్రహించిన ట్రాక్టర్ డ్రైవర్, అతని పక్కనే కూర్చొన్న మరో యువకుడు పక్కకు దూకడంతో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. అన్నింటికీ మించి సాగర్ కాల్వలో నీరు లేకపోవడంతో మరింత ప్రమాదం తప్పిందని సంఘటన స్థలాన్ని గమనించి ఇరుగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే జేసీబీ సాయంతో ట్రాక్టర్ ఇంజన్‌ను బయటకు తీశారు.